పత్రికా ప్రకటన - 2

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

*తేది: 14.08.2014*

కేసిఆర్‌ను చూడాలని ఉంది అన్న ఆ చిన్నారి కోరికను ముఖ్యమంత్రి మన్నించారు. గుండె వ్యాధితో బాధపడుతున్న వరంగల్ జిల్లా నర్మెట్టకు చెందిన 11 ఏళ్ల కొండా శరత్‌ను కేసిఆర్ గురువారం మధ్యాహ్నం ఫిల్మ్‌నగర్‌లోని అపోలో ఆసుపత్రిలో పరామర్శించారు. ఆసుపత్రిలో కేసిఆర్‌ను చూడగానే శరత్, ఆయన తల్లిదండ్రులు భాగ్య, బాలయ్యలు ఎంతో సంతోషపడ్డారు. తనను చూడటానికి స్వయంగా ముఖ్యమంత్రి రావడంతో శరత్ ఉబ్బి తబ్బిబ్బయ్యాడు. కేసిఆర్‌ను చూడగానే రెండు చేతులు జోడించి నమస్కరించాడు. కేసిఆర్ ఆ పిల్లవాడిని దగ్గరికి తీసుకొని ఆప్యాయంగా పలుకరించారు. ఎలా వున్నావని యోగక్షేమాలు తెలుసుకున్నారు. బాలుడి తల్లిదండ్రులను కూడా కేసిఆర్ పలుకరించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిని అపోలో ఆసుపత్రి చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి కేసిఆర్‌కు వివరించారు. బాలుడిని, ఆయన తల్లిదండ్రులను కేసిఆర్ ఎదురుగానే కూర్చోబెట్టుకుని మాట్లాడారు. " ఏం కావాలి శరత్" అని ముఖ్యమంత్రి అడిగారు. డాక్టర్ కావాలని వుంది సార్ అని శరత్ చెప్పాడు. నువ్వు బాగా చదువుకో, తప్పక డాక్టర్ అవుతావు. నేనే చదివిస్తా. అన్ని ఖర్చులు నేనే భరిస్తా అని కేసిఆర్ భరోసా ఇచ్చారు. మాకు ఇల్లు కూడా లేదు సార్ అని శరత్ చెప్పాడు. దీంతో వెంటనే కేసిఆర్ ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు కట్టిస్తానని హామినిచ్చారు. శరత్ వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుందని, ఒక్క రూపాయి కూడా వారిపై భారం మోపవద్దని డాక్టర్లకు కేసిఆర్ చెప్పారు. ఇంటికి వెళ్లిన తరువాత ఖర్చులకోసం పార్టీ తరపున 5 లక్షల రూపాయలు కూడా ఆర్థిక సహాయం అందిస్తామని కేసిఆర్ హామి ఇచ్చారు. శరత్ ఆడుకోవడానికి కావలసిన వీడియో గేములు, ఇతర ఆట వస్తువులు కూడా సమకూరుస్తానని కేసిఆర్ చెప్పారు. కుటుంబానికి అండగా వుంటానని హామి ఇచ్చారు. శరత్‌తో మాట్లాడటం పూర్తయిన తరువాత ఇక నేను వెళ్లవచ్చా అని కేసిఆర్ అడిగారు. దానికి శరత్ ఇంకొంచెం సేపు వుండండి, పోవద్దు అన్నాడు. దీంతో కేసిఆర్ మరి కొద్ది సేపు శరత్ వద్దనే గడిపారు. శరత్‌కు పండ్లు, చాక్లెట్లు అందించారు. శరత్‌ను ఆశీర్వదించి వచ్చారు. శరత్ ఆరోగ్యాన్ని కాపాడాలని ఎంత ఖర్చయిన ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి డాక్టర్లకు చెప్పారు. ఈ సందర్భంగా శరత్ తల్లిదండ్రులు భాగ్య, బాలయ్యలు మాట్లాడుతూ తమ కొడుకు కేసిఆర్‌ను చూడాలని 20 రోజుల నుండి తపిస్తున్నాడని ఇవ్వాల ఆ కోరిక నెరవేరటం ఆనందంగా వుందన్నారు. కేసిఆర్ స్వయంగా వస్తాడని కలలో కూడా అనుకోలేదని ఇప్పటికి నమ్మ బుద్ది కావడం లేదని బాలయ్య చెప్పారు. చాలా మంది పిల్లలకు ఇలాంటి తీరని కోరికలు వుంటాయని, కాని కేసిఆర్ లాంటి కొందరు మాత్రమే వారి కోరికలను నెరవేరుస్తారని అపోలో ఆసుపత్రి చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి అన్నారు. ప్రభుత్వాధినేత స్వయంగా వచ్చి ఒ పిల్లాడిని పరామర్శించిన సంఘటన బహుశా ప్రపంచంలోనే ఇది మొదటి సారి కావచ్చని చెప్పారు. కేసిఆర్‌తోపాటు ప్రభుత్వ సలహాదారుడు కెవి.రమణాచారి, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి వున్నారు.

ఇదీ నేపథ్యం..

వరంగల్ జిల్లా నర్మెట్ట గ్రామానికి చెందిన కొండా శరత్ గుండెకు సంబంధించిన వ్యాధితో పుట్టాడు. చిన్నప్పటి నుండే శ్వాస తీసుకోవడం కష్టమైంది. ఎప్పుడూ జ్వరంతో బాధపడేవాడు. శరీర రంగులో కూడా మార్పులు వచ్చేవి. దీంతో తల్లిదండ్రులు బాలయ్య, భార్య తల్లడిల్లి పోయారు. ఆసుపత్రుల చుట్టూ తిరిగారు. చివరికి ఆ పిల్లాడికి సెప్టల్ డిఫెక్ట్ (Septal defect) వున్నట్లు తేలింది. వెంటనే గుండె ఆపరేషన్ చేయాలని డాక్టర్లు చెప్పారు. దీంతో 2005 లో పిల్లాడి వయస్సు మూడేళ్లు వున్నప్పుడు మొదటి సారి గుండెకు ఆపరేషన్ చేశారు. అప్పటి నుండి మందులతో నెట్టుకొస్తున్నారు. ఇటీవల మళ్లీ సమస్య వచ్చింది. తల్లిదండ్రులు మళ్లీ ఆ పిల్లాడినిహైదరాబాద్‌లోని ఆపోలో ఆసుపత్రికి తీసుకొచ్చారు. మళ్లీ ఆపరేషన్ చేయాలని డాక్టర్లు చెప్పారు. దీంతో కొద్ది రోజుల క్రితం మళ్లీ ఆపరేషన్ చేశారు. తాత్కాలికంగా ఆపరేషన్ చేసి నెట్టుకొస్తున్నాము తప్ప ఇప్పటికి బాలుడి పరిస్థితి పూర్తిగా మెరుగ్గా వుందని చెప్పలేమని డాక్టర్లు అంటున్నారు. మరో రెండు మూడు సార్లు ఆపరేషన్ చేయాల్సి రావచ్చని, అయినప్పటికి ఆ పిల్లాడికి వున్న జబ్బు పూర్తిగా నయమవుతుందనే విషయంలో నమ్మకం లేదని చెబుతున్నారు. డాక్టర్లు తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు.

వివిధ రకాల జబ్బులతో బాధపడుతున్న పిల్లలను పరామార్శించడానికే నెలకొల్పిన మేక్ ఎ విష్ అనే అంతర్జాతీయ సంస్థ ప్రతినిధులు అపోలో ఆసుపత్రిలో శరత్‌ను కలిశారు. వైద్య చికిత్సల గురించి తెలుసుకున్నారు. సంస్థ ప్రతినిధి ప్రియ తులూరి ఆ బాబును నీకేమయిన కోరికలు వున్నాయా అని అడిగింది. అప్పుడు ఆ బాలుడు ఒక్క నిమిషం కూడా ఆలోచించకుండా తనకు కేసిఆర్‌ను చూడాలని వుందని చెప్పాడు. కేసిఆర్‌తో మాట్లాడటం ఎప్పటి నుంచో కోరికని వెల్లడించాడు. తాను ఆసుపత్రిలో వున్నప్పటికి కేసిఆర్‌ను చుడాలనే ఎప్పుడు ఆలోచిస్తానని ఆ బాలుడు వెల్లడించాడు. స్వంత గ్రామంలో టైలరింగ్ చేసే బాలుడి తండ్రి బాలయ్య కూడా తన కొడుకు ఎప్పుడూ కేసిఆర్ గురించే తపిస్తున్నాడని చెప్పారు. తమ గ్రామంలో తెలంగాణ ఉద్యమం ఉదృతంగా సాగేదని అప్పుడు తన కొడుకు అన్ని విషయాలను ఆసక్తిగా చూసేవాడని బాలయ్య చెప్పాడు. టివిలో కేసిఆర్ ఎప్పుడు కనిపించినా సంతోషించేవాడన్నాడు. ఆరోగ్యం బాగా లేక ఆసుపత్రిలో వున్నప్పటికి కేసిఆర్ గురించే ఆలోచిస్తున్నాడని వెల్లడించాడు. కేసిఆర్‌ను చూడాలనే బాలుడి కోరికను విన్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆ బాలుడి కోరిక నెరవేరాలని ఆకాంక్షించారు. ఆ కోరిక మేరకే కేసిఆర్ శరత్‌ను పరామర్శించారు.

--------------------------------------------------------------- -----------

సిపిఆర్ఓ టూ సిఎం